నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 12 ఏప్రిల్ 2024 | VIKARABAD

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆ ఇద్దరికీ బుద్ధి చెబుదాం..

- గులాబీ జెండాపై గెలిచి ద్రోహం చేసిన రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చిత్తుగా ఓడిద్దాం..
- కాసాని గెలుపును అధినేతకు బహుమతిగా ఇద్దాం..
- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్, కందుకూరు మండలంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

బడంగ్‌పేట/కందుకూరు, ఏప్రిల్11 : చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగురవేసేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇం ద్రారెడ్డి అన్నారు. గురువారం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్, కందుకూరు మండలంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని.. ప్రజా బలం ఉన్నంత వరకు ఎంతమంది పార్టీలు మారినా బీఆర్ఎస్‌కు నష్టం ఉండదని స్పష్టం చేశా రు. కసిగా పనిచేసి రానున్న చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి.. పార్టీ అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించా రు. వంద రోజులు దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైనదని ఆరోపించారు. పాలకుల్లో అభద్రతాభావం పెరిగిందన్నారు. రాష్ట్రాభి వృద్ధికి కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. ఊపిరి ఉన్నంత వరకూ కేసీఆర్ వెంటే ఉంటాన న్నారు. ప్రస్తుతం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న విశ్వే శ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలకు సూచించారు. చలో చేవెళ్ల కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని.. ఇందుకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని మాజీ మంత్రి సూచించారు. అదేవిధంగా కందుకూరు మండలంలోని సార్లరావులపల్లి తండాకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ లావణ్యాబీరప్ప, కార్పొరేటర్లు అనిల్‌కుమార్, బాలమణి, రాజేందర్‌రెడ్డి, నర్సింహ, సురేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, అంజయ్య, దశరథ, జయేందర్, మేఘనాథ్‌రెడ్డి, ఇందిరమ్మ, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కేటీఆర్ రాక

- ఆదిబట్ల మున్సిపల్ పరిధి బొంగ్లూరు సమీపంలోని ప్రమిద గార్డెన్‌లో సమావేశం
- పార్లమెంట్ ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తమ వ్యూహాలకు పదును పెడుతున్నది. భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నానికి చెందిన క్యామ మల్లేశ్‌ను పార్టీ అధిష్ఠానం డిక్లేర్ చేసిన విషయం విదితమే. దీంతో ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీ తీసుకురావడమే లక్ష్యంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఇబ్రహీంపట్నానికి రానున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూరు గేటు వద్ద ఉన్న ప్రమిద గార్డెన్‌లో నియోజకవర్గానికి చెందిన ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రమిదగార్డెన్‌కు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై, పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు దిశానిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఉన్నప్పటికీ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని, మరోవైపు కరువుతో పంటలు ఎండిపోవడంతో పాటు తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తుండడంతో నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలను పెద్ద ఎత్తున తరలించేందుకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి క్యాడర్‌కు ఆదేశాలు జారీ చేశారు. మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్, యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్నట్లు గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు.

నేడు ప్రమిద గార్డెన్‌లో సమావేశం..

– జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఇందులో భాగంగా శుక్రవారం ప్రమిదగార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, నాలుగు మున్సిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు హాజరు కావాలని కోరారు.



రేపు చేవెళ్లలో భారీ బహిరంగ సభ

ఈ సభ నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

లోక్‌సభ నోటిఫికేషన్‌కు ముందు నిర్వహిస్తున్న మొదటి సభ కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ శ్రేణులు

ప్రతిపక్షాలకు దీటైన సమాధానం ఇచ్చేలా జనసమీకరణ

ప్రచారాన్ని ఉరకలెత్తించనున్న కేసీఆర్

సభ సక్సెస్‌కు సమన్వయంతో పని చేస్తున్న నేతలు

'చేవెళ్లతో పెనవేసుకున్న పేగుబంధంతో బీఆర్ఎస్ పార్టీ వరుసగా రెండుసార్లు ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకున్నది. ఈసారి కూడా విజయబావుటా ఎగురవేసేందుకు పక్కా ప్లాన్‌తో వెళ్తున్నది. ఈ నేపథ్యంలో ఇదే వేదిక నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రచార శంఖారావాన్ని పూరించనున్నారు. ఈనెల 13న చేవెళ్లలో నిర్వహించనున్న బహిరంగ సభను సక్సెస్ చేసి చేవెళ్ల గడ్డ..బీఆర్ఎస్ అడ్డా..అని సత్తా చాటేందుకు నేతలు సమాయత్తమవుతున్నారు. ప్రతిపక్షాలకు దీటైన సమాధానం ఇచ్చేలా భారీ జన సమీకరణపై దృష్టి సారించారు. లోక్‌సభ నోటిఫికేషన్‌కు ముందు నిర్వహిస్తున్న తొలి సభతో ప్రచారాన్ని కేసీఆర్ ఉరకలెత్తించనుండడంతో రాజకీయ ప్రత్యర్థుల గుండెల్లో గుబులు మొదలైనది.'

– రంగారెడ్డి, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ)

సత్తా చాటేందుకు.. బీఆర్ఎస్ సన్నాహాలు

చేవెళ్ల వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేయనున్న ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. జనరల్ స్థానమైన చేవెళ్ల లోక్‌సభ బరిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌ను వ్యూహాత్మకంగా కేసీఆర్ నిలబెట్టారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి పోటీచేస్తున్న రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి ఇద్దరూ గతంలో బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీని వీడారు. ప్రతి ఎన్నికకు పార్టీలు మారే నాయకులు కావాలా? అప్పటికీ చేవెళ్లతో పెనవేసుకున్న బీఆర్ఎస్ పేగుబంధం కావాలా..? అనేది తేల్చుకునే క్రమంలో..డోలాయమానంలో ఉన్న చేవెళ్ల ప్రజానీకానికి కేసీఆర్ కర్తవ్య బోధ చేయనున్నట్లు తెలుస్తున్నది. ప్రజల మేలు కోరే పార్టీ కావాలా? లేక సొంత ప్రయోజనం కోసం పార్టీ మారే నేత కావాలా..? అన్న మీమాంస పటాపంచలు అయ్యేలా ప్రజలకు దిశానిర్దేశం చేయనున్నారు. చేవెళ్లతోపాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, భువనగిరి, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలతో రంగారెడ్డి జిల్లాకు అనుబంధం ఉండడంతో చేవెళ్ల వేదికగా ప్రతిపక్ష పార్టీల పాలనా తీరును తూర్పారబట్టేలా కేసీఆర్ ప్రసంగం ఉండనున్నట్లు సమాచారం. అలాగే..పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ జనరంజక పాలనను ప్రస్తావిస్తూనే..తెలంగాణపై తనకున్న భావోద్వేగ బంధాన్ని ఆవిష్కరించి ప్రజలను సమాయత్తం చేయనున్నారు.

కలిసికట్టుగా నేతలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లాలోని 8 అసెంబ్లీ స్థానాల్లో ఐదింటిని గెలుచుకుని పటిష్ట స్థితిలో ఉన్నది. అధికార పార్టీ ప్రలో భాలకు తలొగ్గి ఎమ్మెల్యేలతోపాటు బీఆర్ఎస్ జెండా మోసిన నేతలు, కార్యకర్తలు ఎవరూ పార్టీని వీడకపోవడంతో జిల్లాలో పార్టీ చెక్కు చెదరకుండా ఉన్నది. ఈ నేపథ్యంలోనే పార్టీ నేతలు చేవెళ్ల ఎంపీ స్థానం గెలుపు కోసం కసిగా పనిచేస్తున్నారు. ప్రజలకు దిశానిర్దేశం చేసే కేసీఆర్ బహిరంగసభకు ప్రాధాన్యత ఇచ్చి విజయవంతానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. నేతలంతా సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు సాగుతున్నారు. సభా ఏర్పాట్లు, జనసమీకరణ తదితర వాటిపై మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ క్యాడర్‌తో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఈనెల 6న తుక్కుగూడలో నిర్వహించిన సమావేశంలో జనం నుంచి పెద్దగా జోష్ కనబడలేదు. హామీలను విస్మరించిన ఆ పార్టీపై ఆగ్రహంతో ఉన్న అన్ని వర్గాల ప్రజానీకం బీఆర్ఎస్‌ను ఆదరిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే పెద్ద సంఖ్యలో ప్రజలను బహిరంగ సభకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ నేతలు సైతం పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడంతో పాటు సామాన్య జనం సైతం కూడా పెద్ద ఎత్తున సభకు వచ్చేలా చూస్తున్నారు.

సభకు భారీగా తరలి రావాలి

–మాజీ మంత్రి,సబితాఇంద్రారెడ్డి

చేవెళ్లలో ఈనెల 13న నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చేవెళ్ల గడ్డపై కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారని.. ముచ్చటగా మూడోసారి కూడా చేవెళ్ల ఎంపీ స్థానాన్ని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, మేయర్ దుర్గా దీపులాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

టార్గెట్.. హ్యాట్రిక్

- చేవెళ్ల లోక్‌సభ స్థానంలో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ ముందుకు..
- ఇప్పటికే సన్నాహక సమావేశాలు పూర్తి
- ప్రచారంలో స్పీడ్ పెంచిన బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్
- సెగ్మెంట్లకు ఇన్‌చార్జిలను నియమించిన పార్టీ అధిష్ఠానం
- కాసానికి మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం
- బీఆర్ఎస్ శ్రేణులను ముందుండి నడిపిస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్లకు గడువు సమీపిస్తుండడంతో ప్రచారం జోరందుకున్నది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మరోసారి గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించేలా బీఆర్ఎస్ పార్టీ పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్నది. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సహా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో సమావేశమై గెలుపుపై దిశానిర్దేశం చేశారు. అంతేకాకుండా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బరిలో నిలపడంతో గెలుపు పక్కా అనే ధీమా వ్యక్తమవుతున్నది. ఇప్పటికే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో సన్నాహక సమావేశాలను నిర్వహించి బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి నియోజకవర్గ సన్నాహక సమావేశాల్లో పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలలైనా ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని..ప్రజాసంక్షేమాన్ని గాలికివదిలేసిందని ఆరోపించారు. అందువల్ల రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను పట్టించుకోని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. అంతేకాకుండా కష్టపడి ఎంపీలుగా గెలిపిస్తే.. స్వార్థం కోసం పార్టీలు మారి.. ప్రస్తుతం చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్, బీజేపీల నుంచి పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డిలను ఓడించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు కసిగా పని చేయాలన్నారు.

ప్రచారంలో స్పీడ్ పెంచిన బీఆర్ఎస్..

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ స్పీడ్ పెంచారు. చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ ఏర్పాటైన అనంతరం జరిగిన ఎన్నికల్లో రెండుసార్లు విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ.. మూడోసారి కూడా చేవెళ్లపై గులాబీ జెండా ఎగురవేసేలా పక్కావ్యూహంతో ముందుకెళ్తున్నది. ఇప్పటికే నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలను పూర్తిచేసి.. క్షేత్రస్థాయి ప్రచారంపై దృష్టి సారించింది. అంతేకాకుండా కాసాని జ్ఞానేశ్వర్ వివిధ సంఘాలు, వార్డులు, మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారంలో దూసుకెళ్తుండగా..అతడికి మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు ఊరూరా ప్రచారం చేస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ వంటి వాటిలోనూ ప్రచారం జోరందుకున్నది. మరోవైపు కాసాని ప్రచార రథాలు కూడా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అంతటా తిరుగుతున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థికి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. బీసీలే కాకుండా అన్ని వర్గాలు ప్రజలు, సంఘాల సభ్యులు కూడా మద్దతు తెలుపుతున్నారు.. బ్రహ్మరథం పడుతున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవంతోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన కాసాని.. జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉండడంతో వికారాబాద్, పరిగి, తాండూరు సెగ్మెంట్లకు చెందిన నాయకులు పార్టీలకతీతంగా కాసానిని గెలిపించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

సెగ్మెంట్లకు ఇన్‌చార్జిల నియామకం..

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ముందుకెళ్తున్నది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌పై పట్టున్న మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలోని వికారాబాద్, పరిగి, తాండూరు, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం సెగ్మెంట్ల నాయకులను సమన్వయం చేసుకుంటూ కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఓడించడమే లక్ష్యంగా జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా ఇన్‌చార్జిలను పార్టీ అధిష్ఠానం నియమించింది. వికారాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాష్ట్ర నాయకుడు పీ.కార్తిక్‌రెడ్డి, తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా జడ్పీ వైస్‌చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ సీనియర్ నేత రాంచందర్‌రావు, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాష్ట్ర కార్యదర్శిగా నాగేందర్‌గౌడ్ వ్యవహరించనున్నారు.



భక్తిపారవశ్యం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా రంజాన్ వేడుకలు

నెల రోజులుగా ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. 'ఈద్ ఉల్ ఫితర్'ను పురస్కరించుకొని ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఈద్గా, మసీద్‌ల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు (ఖాజీలు) ఖురాన్ బోధనలను చదివి వినిపించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు.

– న్యూస్‌నెట్‌వర్క్, నమస్తేతెలంగాణ

పండుగ శుభాకాంక్షలు తెలుపుకొంటున్న చిన్నారులు

చేవెళ్లలో..

తాండూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు